

'అధికారం' వెనుక 'రౌడీయిజం..!

రౌడీయిజం రోజు రోజుకు పెరుగుతోంది. పగలు, రాత్రి బయట తిరగాలంటే జనం భయపడిపోతున్నారు. ఎవరితో మాట్లాడాలన్నా వణుకుతున్నారు. ఎవరితో మాట్లాడితే ఏం జరుగుతుందోననే భయం వెంటాడుతోంది. ఒకప్పుడు పోలీసులంటే వణికిపోయిన రౌడీలు, దొంగలు, అల్లరిమూకలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం అధికారపార్టీ నేతల సపోర్టుగా తెలుస్తోంది. ఏం చేసినా తమ నేతలు చూసుకుంటారనే ధోరణి రౌడీల్లో పెరిగిపోయింది. ఇటీవల కాలంలో హత్యలు పెరుగుతున్నాయి. రాజకీయ నేతల జోక్యం పెరిగిపోవడంతో పోలీసు అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత క్షీణించిపోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలోపెరుగుతోన్న హత్యలు
- పెట్రేగిపోతోన్న రౌడీలు
- అధికారపార్టీ నేతల సపోర్టు
- పోలీసులకు సవాల్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"అన్న ఉన్నాడు, మనం ఏంచేసినా ఆయన చూసుకుంటారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండానే బయటకు రావచ్చు. మనన్ని తాకే పోలీసులు ఎవరున్నారు " అంటూ రౌడీలు ఓ వైపు రెచ్చిపోతున్నారు. మరో వైపు " సార్ వాళ్లు మా పిల్లలే. ఏం అనొద్దు,నేను మాట్లాడతా,వారి గురించి పట్టించుకోవద్దు " అంటూ అధికారపార్టీ చోట నాయకులు పోలీసు అధికారులకు సూచనలిస్తున్నారు. పోలీసులు రౌడీల జోలికి వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ఏ నాయకుడు నుంచి ఫోన్ వస్తుందో. తమ పోస్టుకు ఎక్కడ ఎసరు పెడతారో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో కేసులు, హత్యలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు రాజకీయ విమర్శలు అన్ని రాజకీయ పార్టీల నేతలు చేసుకునేవారు. ఇప్పుడు అధికారపార్టీ నేతల గురించి ఎవరైనా మాట్లాడితే హత్య చేయడానికి వెనుకాడటం లేదు. దాడి చేయడం వల్ల ఇతరులను బయపెట్టవచ్చును అనే ఆలోచన రాజకీయాల్లో పెరుగుతోంది. తెలుగు యువత నాయకులు తిరుమల నాయుడు పై హత్యాయత్నం జరిగింది. కొద్దిలో ప్రాణాపాయం తప్పింది. ఇటీవల టిడిపి నాయకులు మాతంగి కృష్ణపై వైసిపికి చెందిన కొందరు వ్యక్తులు పట్టపగలు అతిదారుణంగా దాడి చేశారు. అటు తరువాత వైసిపి నేత పై టిడిపికి చెందిన వ్యక్తులు దాడిచేశారని ఫిర్యాదు పోలీసులకు అందింది. కేసులతో సంబంధం ఉన్న బుజబుజ నెల్లూరుకుచెందిన రౌడీ షీటర్ గిరీష్‌కుమార్ (28)ను అత్యంత దారుణంగా హరిత హోటల్ వద్ద హత్య చేశారు. ఇది రాజకీయ హత్యగా భావిస్తున్నారు. రాజకీయ హత్య, రౌడీల మధ్య జరిగిన గొడవలా తెలియడం లేదు. ఈనెల 4 వతేదీ హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు బుచ్చిరెడ్డి పాలెంకు చెందిన ఓ యువతిని ప్రేమించి ఇక్కడకు వచ్చారు. అటు తరువాత ఆయనను హత్యచేసి, గోనె సంచిలో కట్టి పొదలకూరు రోడ్డులోని గౌతమి నగర్‌లో పడేసి వెళ్లారు. కోవూరు మండలం, లేగుంటపాడు జెండాచెట్టుకి చెందిన ఇద్దరు స్నేహితుల మద్యం సేవిస్తూ గొడవ పడి సందానీ (32) హత్య చేశారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. నగరంలో ఏ వైపు చూసినా గూండాల బెదిరింపులు, హత్యలు కొనసాగుతున్నాయి. పోలీసు స్టేషన్ వరకు కేసులు వెళ్లడం లేదు. ఒక వేళ వెళ్లినా క్షణాల్లో బయటకొస్తున్నారు. అందుకు అధికార పార్టీకి చెందిన నేతల సహకారం ఉంటుందని విమర్శలున్నాయి. పోలీసులు స్వచ్ఛందంగా వ్యవహరించలేకపోతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. రోజురోజుకు పెరుగుతోన్న హత్యలు, రౌడీయిజంకు సంబంధించి ఎస్‌పి ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ మేళాలు నిర్వహించారు. రౌడీలకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కడైనా హింసకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ మూకల ఆగడాలు కట్టిపెట్టకుంటే పరిస్థితి మరింత దిగజారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

హత్యకు గురైన వ్యక్తి (ఫైల్)

హత్యకు గురైన మహిళ (ఫైల్)

ఓట్ల నమోదులో అక్రమాలను అరికట్టాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

నెల్లూరు :ఎంఎల్‌సి ఓట్ల నమోదులో అధికార వైసిపి అక్రమాలకు పాల్పడుతుందని ప్రజా సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు అధికార పార్టీ ఆగడాలను నిరసిస్తూ సోమవారం సాయంత్రం 6 గంటలకు నగర తహశీల్దార్ కార్యాలయం ఎదుట పలు ప్రజా సంఘాలు, యుటిఎఫ్ నేతలు ఆందోళన చేపట్టారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓట్ల నమోదు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. అయినప్పటికీ సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో నెల్లూరు అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి అధికార పార్టీ చెందిన కొందరు వ్యక్తులు వందల సంఖ్యలో అప్లికేషన్ల కట్టలు తీసుకొచ్చి నమోదు చేసే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం ప్రజా సంఘాలు, యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలకు తెలిసింది. వెంటనే సమాచారంతో ఉపాధ్యాయ అభ్యర్థి పి.బాబు రెడ్డి, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం మోహన్ రావు, సిఐటియు నాయకులు కత్తి శ్రీనివాసులు, పి. సూర్యనారాయణ ,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.వి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవీరవిపతి శర్మ, వివి శేషులు,అసోసియేట్ అధ్యక్షులు ఎం సి అయ్యన్న , యుటిఎఫ్ నాయకులు సురేంద్ర తదితర ప్రజా సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఓటర్ల నమోదులో అక్రమాలను అరికట్టాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి పి బాబురెడ్డి , నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను తప్పనిసరిగా నాటాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం నరసింహకొండ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో చేపట్టిన జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో జిల్లా సామాజిక అటవీ శాఖ అధికారి డి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ మొక్కలునాటారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 12.10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించామని, ఈ మేరకు ప్రతి ఒక్క పౌరుడు తన బాధ్యతగా ఒక మొక్కను తప్పనిసరిగా నాటాలని పిలుపునిచ్చారు.. జిల్లా సామాజిక అటవీ శాఖ అధికారి డి శ్రీనివాసులు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి శ్రీ శ్రీనివాసులు రెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ శ్రీ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, అటవీ శాఖ అధికారులు శ్రీ కె శివ రామకృష్ణ, మాల్యాద్రి పాల్గొన్నారు.

హమాలీలకు పని భద్రత కల్పించాలి

నెల్లూరు :దేవరపాలెం ఎపి బిసి ఎల్ఎంఎల్ అండ్ బీర్ డిపో హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించాలని హమాలీ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం నెల్లూరు రూరల్ మండలం, దేవరపాలెంలో ఎపిబిసిఎల్ ఐఎంఎల్ అండ్ బీర్ డిపో హమాలీ వర్కర్స్ (సిఐటియు) యూనియన్ ఆధ్వర్యంలో వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఆరో రోజు నిరసన కార్యక్రమంలో రూరల్ సిఐటియు నేత అల్లాడి. గోపాల్ మాట్లాడారు. హమాలీలు ఇ.భాస్కర్, వై.సాంబయ్య, సరసయ్య, జి. శివకుమార్, వెంకటేశ్వర్లు, బి.రవీంద్ర, జి.కోటేశ్వ రరావు,జి.జనయ్య పాల్గొన్నారు.

జిఒ నెంబర్ 52ను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద నిరసన

నెల్లూరు : బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ జి నంబర్ 52, శామ్యూల్ ఆనందకుమార్ ఏక్య సభ్య కమిషన్ రద్దు చేయాలంటూ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలో భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లోని వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కెసి పెంచలయ్య ప్రారంభించారు. ఈ ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్ ప్రాంతం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట గిరిజనులు బైఠాయించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. కెసి పెంచలయ్య మాట్లాడుతూ బోయలను ఎస్టి జాబితాలో చేర్చడం దుర్మార్గమైన నిర్ణయమన్నారు. ఈ నిర్ణయం వల్ల నిజమైన ఎస్‌టిలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చక్రధర్ బాబుకి వినతిపత్రం అందజేశారు. మానుపాటి నవీన్, బిఎల్. శేఖర్, రాపూరు కష్ణయ్య, చౌటూరు శీనయ్య, పోలయ్య, పోట్లూరు శ్రీనివాసులు, చేవూరు సుబ్బారావు, బూదూరు కేశవరామ్, చెంబేటి ఉష, సుమతి, ఏకోల్లు లక్ష్మి, సత్యవతి, కళావతి, జయలక్ష్మి, రాపూరు రాధమ్మ, కలుగోలమ్మ పాల్గొన్నారు.

అబూబకర్‌కు అభినందనలు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు షేక్. అబూబకర్ ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవికి ఎంపికయ్యారు.ఆయనకు పార్టీలకతీతంగా పలువురు అభినందనలు తెలుపుతున్నారు. అబూబకర్‌కు పదవి దక్కడం పట్ల సహకరించిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మైనార్టీలు కతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో అబూబకర్ అత్యున్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తున్నారు.

నూరు శాతం అక్షరాస్యత సాధించాలి

నెల్లూరు :జిల్లాలో నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యంగా అక్షర చైతన్యం-2 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం నరసింహకొండ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గతంలో నిర్వహించిన అక్షర చైతన్యం-1 కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, ఇదే స్ఫూర్తితో అక్షర చైతన్యం-2 కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టినట్లు చెప్పారు.

రామలింగేశ్వరస్వామి ఆలయం కిటకిట

వలేటివారిపాలెం :వలేటివారిపాలెంలోని చుండి రామలింగేశ్వర స్వామి దేవస్థానం సోమవారం యాత్రికులతో కిటకిటలాడింది. కార్తీకమాసం కావడంతో పాటు మంగళవారం చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో సోమవారం యాత్రికులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. వసతులను ఆలయ కార్యనిర్వహణాధికారి వెలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కల్పించారు. తహశీల్దార్ సుందరమ్మ పూజలో పాల్గొన్నారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు. పరిసర గ్రామాల ప్రజలు సైతం అన్నదానంలో పాల్గొన్నారు. ఆలయంలో జరిగే కార్యక్రమాలను ఇఒ ఆధ్వర్యంలో సిబ్బంది మోకా యోగానంద్ పర్యవేక్షించారు. ఆర్ఐ కుంచాల నరసయ్య, విఆర్ఒలు ఉన్నారు.

పూజలో పాల్గొన్న తహశీల్దార్ సుందరమ్మ

బిసిలను ఆదుకోవాలి

కందుకూరు :బిసి జాబితాలో వెనుకబడిన కులాలను ఎస్ టి జాబితాలో చేర్చాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం కందుకూరు నియోజక వర్గం అధ్యక్షుడు కుంచాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బిసి కులాల్లోని అనేక మంది యువత ఉపాధి అవకాశాలు లేక వలస బాట పడుతున్నారన్నారు.

సబ్సిడీపై శనగలు పంపిణీ

గుడ్లూరు :మండలంలోని పారకొండపాడు పంచాయతీ పరిధిలోని రైతులందరికీ సబ్సిడీపై తెల్ల శనగలు, విత్తనాలు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎఒ రవికుమార్ సోమవారం తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం లో రైతులతో సబ్సిడీ విత్తనాలు గురించి సదస్సు నిర్వహించారు. ఒక్కో రైతు కి 25 కేజీల సెనగ విత్తనాల బ్యాగు సబ్సిడీ పోను 1600 చెల్లించాలని తెలిపారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

కందుకూరు:పట్టణంలోని బూడిదపాలెంలోని చైతన్య కోపరేటివ్ జూనియర్ కళాశాలలో తమ పిల్లలను చేర్చుకున్నారని, ఇప్పుడు కాలేజీని మూసివేస్తామని యాజమాన్యం చెపుతుందని సబ్ కలెక్టర్ శోభితకు సోమవారం మస్తాన్ వలి ఫిర్యాదు చేశారు. పిల్లలకు కాలేజీలో అడ్మిషన్లు తీసుకొని తరువాత మాసివేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలు భవిష్యత్తును దష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకం

కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి

నెల్లూరు :ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య నాలుగో స్తంభంగా, అభివద్ధి కార్యక్రమాల అనుసంధాన కర్తలుగా పాత్రికేయులు వ్యవహరిస్తారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పత్రికా సమాచార కార్యాలయ అధికారులు సోమవారం నగరంలో నిర్వహించిన వార్తాలాప్ (పాత్రికేయుల వర్క్ షాప్) కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వర్క్ షాప్ కార్యక్రమాన్ని జిల్లా పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు పథకాలు, సంక్షేమ కార్యక్రమాల వివరాలను పాత్రికేయులకు అవగాహన కల్పిస్తూ వర్క్ షాప్ నిర్వహించారు. ఎంఎల్‌సి వాకాటి నారాయణ రెడ్డి, ఆర్.డి.ఓ మాలోల, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కనక దుర్గా భవానీ, జిల్లా సమాచార పౌర సంబం ధాల అధికారి ఎం. వెంకటేశ్వర ప్రసాద్, పలువురు జర్నలిస్టు సంఘాల నేతలుపాల్గొన్నారు.

కిషనర్‌రెడ్డిని కలిసిన అధికారులు

నెల్లూరు :కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్ రెడ్డి నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం నగరానికి విచ్చేశారు. రైల్వే స్టేషన్ నుంచి ఆర్ అండ్ బి అతి గృహానికి చేరుకుని ఆయనకు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డిని కలిసినవారిలో కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖాధికారి కనకదుర్గ భవాని ఉన్నారు. నగర వ్యాప్తంగా జరుగుతున్న వివిధ అభివద్ధి కార్యక్రమాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కమిషనర్ వివరించారు. నగర పర్యటనకు వచ్చిన కిషన్‌రెడ్డి నగరంలోని జయభారత్ వైద్యశాలను సందర్శించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అత్యవసర విభాగాన్ని ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు :కలెక్టర్

నెల్లూరు :స్పందన లో వచ్చే అర్జీలను సరైన పరిష్కారం చూపకుండా మూసివేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చక్రధర్ బాబు అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజా విజ్ఞప్తుల దినం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను మొక్కుబడిగా కాకుండా అర్జీదారులు సంతప్తి చెందేలా పరిష్కార మార్గం చూపాలన్నారు. ఆయా దరఖాస్తులు మరలా మరలా పునరావతం కాకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, డిఆర్డిఎ, మెప్మా, హౌసింగ్, పీడీలు సాంబశివరెడ్డి, రవీంద్ర, నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డా పెంచలయ్య, సర్వశిక్ష ఎ పి సి ఉషారాణి, డి.ఎస్.ఒ వెంకటేశ్వర్లు, డిపిఓ ధనలక్ష్మి, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ లు వెంకటసుబ్బయ్య, కష్ణమోహన్, రంగ వరప్రసాద్, సర్వే లాండ్ రికార్డ్స్ ఎ డి హనుమాన్ ప్రసాద్, తెలుగు గంగ స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు పరిష్కారం

నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది నిబద్ధత పాటించాలని, గడువులోపు సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ హరిత సూచించారు. కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన వేదికలో ముందుగా 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం ద్వారా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచనలు జారీచేశారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా వినతి పత్రాలను స్వీకరించి గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

న్యాయపరంగానే భూములు కొనుగోలు

-టిడిపి తప్పుడు ప్రచారం చేస్తుంది..

- ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

విశాఖపట్నంలో రేడియంట్ భూములు కొనుగోలు విషయంలో కోర్టు తీర్పును అనుగుణంగా న్యాయపరంగానే కొనుగోలు చేశామని, టిడిపి తప్పుడు ప్రచారం చేస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల ఆయన మాట్లాడారు. 25 సంవత్సరాల నుంచి తనకు వ్యాపా రమిత్రులు కలకత్తాకు చెందిన మిత్రులతో కలిసి విపిఆర్ ., రేడియంట్ కలిసి ఇక్కడ భూములు కొనుగోలు చేశామన్నారు. 2005 నుంచి కేసు నడుస్తుందని, సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి 2019 ఫిబ్రవరి 14న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిఒ ఇచ్చారన్నారు. ఏప్రిల్‌లో రూ.93 కోట్లు జిఒ ప్రకారం చెల్లించామన్నారు. జిఒ నెంబర్ 77 క్రారం రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. కోర్టు ఉత్తర్వులు మేరకు న్యాయపరంగా అంతా జరిగిందన్నారు. 2011 అగ్రిమెంట్ జరిగిందన్నారు. ఇది ఇద్దరు వ్యాపారుల మధ్య జరిగిన మాత్రమేనని, ఇందులో వైసిపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తనతో కలిసి మైనింగ్ చేసిన వ్యక్తులు, స్పేర్ పార్టు షరఫరా చేసే వారు విపిఆర్ వద్దకు వచ్చారన్నారు. 50 ఎకరాలు డాక్యుమెంట్ ఇచ్చారన్నారు. జెడి ప్రకారం 40 శాతం ల్యాండ్ యజమానికి, 60 శాతం డెవలప్‌ర్‌కు ఇస్తారన్నారు. ఎక్కడా 50 శాతం ఇవ్వరన్నారు. తమ వ్యాపారంలో వైఎస్ భారతీకి, వైఎస్ అనిల్‌కు ఎలాంటి సంబందంలేదని, కేవలం టిడిపి నేతలు దీనిని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లోకి మహిళలను తీసుకురావడం మంచి సాంప్రదాయం కాదన్నారు. రాజకీయ నేతలు వ్యాపారాలు చేయకూడదని ఎక్కడా లేదన్నారు. ప్రభుత్వాని అడ్డం పెట్టుకొని వ్యాపారంచేసే పరిస్థితి తనకు లేదన్నారు. ఈ ప్రాజెక్టు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదన్నారు. ఎక్కడైనా తాను భూ వివాదంలో ఉన్నట్లు నిరూపిస్తే అంతే భూమి నేను ఇస్తానని సవాల్ విసిరారు. టిడిపి ప్రభుత్వం హయంలో వచ్చిన జిఒ ప్రకారమే తాను ఈ భూములు కొనుగోలు చేశామన్నారు. ఇందులో ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

గ్రామోత్సవ వేడుకలు

పొదలకూరు :పొదలకూరు లోని శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 10,11వ తేదీల్లో అంబళ పూజ, గ్రామోత్సవ వేడుకలను నిర్వహిస్తామని పొదలకూరు అయ్యప్ప సేవా సమితి తెలిపింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

డిఇ సుధాకర్‌కు నివాళి

నెల్లూరు : నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మతి చెందిన డేవిడ్ సుధాకర్ కు కమిషనర్ హరిత, సిబ్బంది నివాళులు అర్పించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నగర పాలక సంస్థకు డి.ఈ హోదాలో డేవిడ్ సుధాకర్ అందించిన సేవలను గుర్తు చేసు కున్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలి : టిడిపి

కందుకూరు :కందుకూరు పోస్టాఫీస్ సెంటర్ లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అక్రమ నిర్మాణాల వ్యవహారంపై సబ్ కలెక్టర్ శోభిత కు కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అనుమతి లేని నిర్మాణంపై రెండు రోజుల కిందట మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అప్పటినుంచి రాత్రి పగలు పనులు చేస్తున్నారని నాగేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణం వల్ల పోస్టాఫీస్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. వెంటనే పనులు నిలిపివేయాలని నాగేశ్వరరావు కోరగా, వెంటనే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. టిడిపి పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు,మాదాల మాల్యాద్రి, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు.

'స్పందన'లో అర్జీలు స్వీకరణ

కందుకూరు :కందుకూరు పురపాలకసంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 7అర్జీలు, డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమం ద్వారా 2 ఆర్జీలు మొత్తం9 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ బి. శ్రీరామమూర్తి తెలిపారు అందరూ సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు.

ఎన్‌జి రంగా జయంతి సభ

కందుకూరు :ఆచార్య యన్.జి.రంగా 122వ జయంతి సభ ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ దివి శివరాం మాట్లాడారు. ముఖ్య అతిథిగా టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్, విశిష్ట అతిథులుగా మాజీ ఎంఎల్‌ఎలు దామచర్ల జనార్ధన్ రావు డాక్టర్ ముక్కు ఉగ్రన రసింహా రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు నాదెళ్ల వెంకట సుబ్బారావు ఉన్నారు.

'కనకమేడల'ను కలిసిన శివరాం

టిడిపి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్‌ని ఒంగోలు నగరంలోని ఆచార్య ఎన్జి రంగా భవన్ లో సోమవారం మర్యాదపూర్వకంగా మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ దివి శివరాం కలిసి మాట్లాడారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ,కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు అధ్యక్షులు నాదెళ్ల వెంకట సుబ్బారావు , ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఉపాధ్యక్షులు నామినేని మోహన్ రావు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ట్రెక్కింగ్‌లో 'ప్రకాశం' విద్యార్థిని ప్రతిభ

కందుకూరు :ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థిని పాలకొండ కళ్యాణి ప్రతిభ కనబరిచింది. తమిళనాడులోని నీలగిరి కొండల ఆలిండియా బాలికల ట్రెక్కింగ్‌కు దేశ వ్యాప్తంగా జరిగిన ఎంపికల్లో 299 మంది ఎంపికయ్యారు. ఎపి నుంచి 56 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇందులో గుంటూరు గ్రూప్ నుండి 12 మంది ప్రకాశం గ్రూపు నుండి ఒక్కరు ఎంపికయ్యారు. అందులో తమ కళాశాల విద్యార్థిని స్థానం దక్కించుకోవడం గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని అభినందించారు. ప్రకాశం ఎన్‌సిసి ఆఫీసర్ హిమామ్, అకడమిక్స్ ఇన్ చార్జి ఎస్. ఎం. మీరావలిని రామయ్య అభినందించారు. గత ఏడాది తమ ఎన్‌సిసి గ్రూప్ 52 మంది కాగా వారి శిక్షణా స్ఫూర్తితో ఈ ఏడాది మరో 54 మంది వారికి జత కావడం వల్ల 100కు పైగా క్యాడెట్స్ అయ్యారని రామయ్య తెలిపారు.

కళ్యాణి హర్షం :తాను జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక కావడం వెనుక కరస్పాండెంట్ రామయ్య, మీరావలి ప్రోత్సాహం చెప్పలేనిదని ట్రెక్కింగ్ విజేత పి కళ్యాణి కతజ్ఞతలు తెలిపారు. ఊటీ లోనే ప్రఖ్యాత పార్కు సిమ్స్ సందర్శన, బొగ్గుతో నడిచే రైలు ప్రయాణం,మద్రాస్ రేంజీ మెంట్ మ్యూజియం, టి ఎస్టేట్స్(ఊటీ) సందర్శనాలు విద్యార్థినులంతా అనుభూతి పొందారని కళ్యాణి పేర్కొన్నారు. వింగ్ కమాండర్ కల్నల్ రాకేష్ శర్మ ప్రసంగం ఎంతో ఉత్తేజాన్ని కలిగించిందని కళ్యాణి వెల్లడించారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న కంచర్ల రామయ్య

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

పొదలకూరు :మండలంలోని విరువూరులో ఈనెల 4వ తేదీన జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు పొదలకూరు సిఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడిం చారు. విరువూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న విజయ లక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం వడ్డించి, తిరిగి బయటకు వెళుతున్న సమయంలో ఆమె భర్త వెంకటేశ్వర్లు, ఆమెతో గొడవపడి కత్తితో నరికి చంపాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెను పొదలకూరులోని సామాజిక వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు మతి చెందినట్లు ధ్రువీకరించారు. తన భార్యకు ఎవరితోనో వివాహేతర సంబంధం ఉందని, నిందితుడు రెండేళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. దీంతో హత్య చేశాడని తెలిపారు. నిందితుడిని సోమవారం సంగం రోడ్డు సెంటర్‌లోని ఓ కళ్యాణ మండపం వద్ద అదుపులోకి తీసుకు న్నామని చెప్పారు. నిందితుడు హత్యకు ఉపయోగించిన కత్తిని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం గూడూరు కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. పొదలకూరు ఎస్ఐ షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గుడ్లూరు : సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని వైద్య అధికారి డాక్టర్ మారుతీరావు తెలియజేశారు. మండలంలోని బసిరెడ్డి పాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. త్రాగునీరు కాచి వడపోసుకుని సేవించాలని విద్యార్థులకు సూచించారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ కే సలీం భాష ఇతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గుడ్లూరు :ఉప్పుటేరులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇసుక లోడు ట్రాక్టర్లు అర్ధరాత్రి సమయంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్ రెడ్డి సోమవారం తెలిపారు. రాత్రి సమయాల్లో జోరుగా గుడ్లూరు నుంచి కొత్తపేటకి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం మేరకు రాత్రి సమయంలో కాపుకాచి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ మహాసభ విజయవంతం

ప్రజాశక్తి-ఉదయగిరి

విలీనం పేరుతో పనిభారాలు కార్మికులపై అధికమైందని జోనల్ కార్యదర్శి ఎం.నాగేంద్ర రావు విమర్శించారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ 9వ మహాసభకు ముఖ్య అతిథులుగా జోనల్ కార్యదర్శి ఎం.నాగేంద్ర రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీనంతో మెరుగైన పనివిధానం, సౌకర్యాలు, పాత పెన్షన్ ఇవ్వాలనుకున్న కార్మికులకు బహుమతిగా యుపిఎస్ పేరుతో ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దెబస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు తదితర పనిభారాలు కార్మికులపై మోపుతోందని విమర్శించారు. తక్షణం ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కారం మార్గాలు చూపాలన్నారు. అనంతరం డిపో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవ తీర్మానం చేశారు. గౌరవ అధ్యక్షులు గా సిఐటియు మండల కార్యదర్శి తిరుపతయ్య, డిపో అధ్యక్ష, కార్యదర్శులుగా బి.వెంకటేశ్వర్లు, ఎస్.రవి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్.సుధాకర్‌రెడ్డి, పి.నరసయ్య, షేక్.నజీర్ అహ్మద్, జాయింట్ సెక్రటరీలుగా బి.షావుగా, షేక్.ఖాన్, ప్రచార కార్యదర్శిగా వై.సుదర్శన్, కోశాధికారిగా బి.రవిబాబు, కమిటీ సభ్యులుగా పి.మోహన్ బాబు, షేక్ జలీల్, షేక్.మాబు సుభాని, కె.శ్రీనివాసులు, ఎల్ నారాయణబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాకు.వెంకయ్య, షేక్. ఎజ్దానీబాషా, సిపిఎం కార్యదర్శి పరిధిన్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జోనల్ కార్యదర్శి ఎం.నాగేంద్ర రావు

ఎంఎల్‌సి ఎన్నికలకు సమిష్టిగా కృషి చేద్దాం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రానున్న టీచర్ల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ల రెడ్డి అన్నారు. ఆయన అధ్యక్షతన సోమవారం పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆత్మకూరు కమిటీ కార్యకర్తలు సమస్త గత ఎన్నికలను ఆదేవిధంగా ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ను పట్టభద్రుల ఎన్నికల ఓటర్ల నమోదు అలాగే ఎన్నికల సమన్వయం చేయడం కోసంగా రాష్ట్ర పార్టీ బుల్లెట్ రమణను జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించిందన్నారు. చేజర్ల రమణ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పాదయాత్ర చేస్తూ నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చారు. అందులో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు.

మాట్లాడుతున్న చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి

మాట్లాడుతున్న చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు నియోజకవర్గస్థాయి క్రీడా జట్ల ఎంపిక సందర్భంగా మండల స్థాయిలో గెలుపొందిన క్రీడా జట్ల మధ్య పోటీలను ఆత్మకూరు ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఎంతో ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చి విద్యార్థులు చదువు తదితర రంగాల్లో రాణించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం క్రీడా కారులను పరిచయం చేసుకొని క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ క్రీడల పోస్టర్లను అధికారులు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎంఇఒ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి వాసు, అప్పారావు పాలెం వైసీపీ నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వ్య.కా.సం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి కోవూరు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామం పుచ్చలపల్లి సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం 19వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం కోవూరు మండల కార్యదర్శి బట్ట పెద్ద అబ్బయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికుల పొట్ట కొడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయంలో యంత్రాలు రావడం వల్ల వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఉపాధి లేక కార్మికులు పట్టణాలు, నగరాల బాట పట్టి వివిధ రంగాలలో రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సభల్లో చర్చిస్తామన్నారు. భూ పంపిణీ, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, ఉపాధి హామీ పనులు వంటి వాటిపై చర్చించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ సందేశాన్ని అందించనున్నారు.ఈ మహాసభలకు జిల్లా వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకట సుబ్బారావు

అక్షర చైతన్యం-2ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కావలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షరచైతన్యం రెండవ దశ కార్యక్రమం పై సోమవారం వెల్ఫేర్అసిస్టెంట్లకు, మహిళాపోలీస్, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ నూటికి నూరు శాతం మీ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఒక్కరూ చదువుకొని ఉండాలన్నారు. కనీసం వారు పనులు వారు చేసుకొనే విధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వారు బ్యాంకు కి వెళ్లేటప్పుడు కనీస పరిజ్ఞానం కలిగి ఉండే విధంగా వారందని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైఉందన్నారు. కలెక్టర్ వారి మానస పుత్రిక అయిన "అక్షర చైతన్యం" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వయోజన విద్యాశాఖ సంచాలకులు ఓగు నారాయణ చదువుకుందాం రా! ఒకటే, రెండు వాచకంలపై శిక్షణ నిర్వహించారు. త్వరలోనే గ్రామ సచివాలయంలో నిరక్షరాక్షలకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టవలసిందిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అందరూ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వైసిపి వైఫల్యాలను తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-సీతారామపురం

వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టిడిపి బలోపేతానికి పనిచేయాలని ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం లో టిడిపి మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం పై పూర్తి వ్యతిరేకత వస్తుందని వైసీపీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లో ఎండగడుతున్నందువల్ల టిడిపి కార్యకర్తలు, నాయకులపై దొంగ కేసులను పెడుతూ, పోలీసులను తొత్తులుగా మార్చుకుని అక్రమంగా అడ్డదారుల్లో అరెస్టులు చేసి వైసిపి నాయకులు పైశాచికా నందాన్ని పొందుతున్నారన్నారు. త్వరలోనే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నియోజకవర్గంలోని వైసీపీలో బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఉండదని, సీతారామపురంలో ఇటీవల మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా వైకాపాకు చెందిన బీసీ నాయకుడు పై అదే పార్టీకి చెందిన వారు దాడికి పాల్పడడం నిదర్శనంగా చూడవచ్చన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలోని వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు బహిరంగంగా బయట పడుతున్న నేపథ్యంలో ప్రజల్లోకి మరింతగా వెళ్లి టిడిపి బలోపేతంపై ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి టిడిపికి ప్రత్యేక కేడర్ ఉందని నాయకులు క్యాడర్ ను గుర్తించి పార్టీ బలోపేతాన్ని దష్టిలో ఉంచుకొని అధిక స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేసి రాబోయే 2024 ఎన్నికలలో టిడిపి గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటానని రాబోయే రోజుల్లో వారికే ప్రాధాన్యత ఉంటుందని గుర్తు చేశారు. ప్రజలను నిలువునా వైసిపి ప్రభుత్వం దోచేస్తుందని బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దోపిడిని వివరించాలన్నారు. అనంతరం మాజీ జెడ్‌పి ఛైర్మన్ చెంచల బాబు యాదవ్ టిడిపి పార్టీ ప్రతిష్టతపై మాట్లాడారు.అనంతరం పలు వురు నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, సీతారామ పురం,పబ్బులేటి పల్లి, పోలంగారి పల్లి సర్పంచులు కొడవటికంటి భాగ్య కుమారి, ఎం. ఆదయ్య, ఎం. వెంకటసుబ్బయ్య, గాజులపల్లి చంద్రారెడ్డి, ఎన్. జాషువా, ఇజ్రాయిల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సిఐటియు మండల ద్వితీయ మహాసభ ఆత్మకూరులోని డాక్టర్ చెర్లో రమణారెడ్డి భవనంలో జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యుత్ రంగం, ఆర్‌టిసి, ఆశా, అంగన్‌వాడీ, ఆటో, భవన నిర్మాణ రంగం, మధ్యాహ్న భోజన పథకం తదితర రంగాల నుంచి 80 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా ప్రయివేటు వ్యక్తులకు దారా దత్తం చేస్తున్నారని, పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలో పడవేసిందన్నారు. అత్యధిక లాభాలతో నడుస్తున్న ఎల్ఐసిని జాతీయ విదేశీ పెట్టుబడిదారులకు అప్పచెబు తుండడమే గాక దేశభద్రతను కాలదన్నే రక్షణ రంగం లోకి విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతుందని తెలిపారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ లాంటి వినాశకర విధానాల వల్ల దేశ ఆర్థిక రంగం సంక్షోభంలో పడి ఎక్కడ లేనంతగా నిరుద్యోగం, ఆకలి చావులు పెరిగిపోతున్నాయన్నారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ లను రూపొందించి కార్మికులపై ఉక్కు పాదం మోపుతు ందన్నారు. ఎలాగైతే రైతాంగం చారిత్రాత్మక పోరాటం చేసి చట్టాలను తిప్పి కొట్టారో అదే స్ఫూర్తితో కార్మిక వర్గం 4 లేబర్ కోడ్ లను తీసివేసి తిరిగి కార్మిక చట్టాలను అమలులోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

నూతన కమిటీ ఎన్నిక

సిఐటియు గౌరవ అధ్యక్షుడు జి.వి.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, కోశాధికారి ఎ.మహేష్, ఉపాధ్యక్షులు డేవిడ్ రాజు, బి.రమణమ్మ, షేక్ గుల్జార్ బేగం, సహాయ కార్యదర్శులు నాగేంద్ర, ఎస్‌కె మహమ్మద్ అలీ, పి.జిలాని, పదిమంది కమిటీ సభ్యు లతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి ఉన్నారు.

హైదరాబాదుకు ఆర్‌టిసి బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఆత్మకూరు నుండి హైదరాబాదుకు వయా ఎఎస్ పేట తోపాటు హసనాపురం, కలిగిరి మీదుగా ఆర్‌టిసి సూపర్ లగ్జరీ బస్సును నడప నున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్.కరీమున్నీసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం ఉన్న ఎఎస్ పేట (రహమతాబాద్) దర్గాకు నిత్యం హైదరాబాద్ నుంచి యాత్రికులు వస్తూ ఉంటారని, వారి సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రయాణికుల రద్దీ దష్ట్యా మరిన్ని బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణికులు భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఈ బస్సు గతంలో ఆత్మకూరు నుంచి బయలుదేరి ఎఎస్ పేట నుంచి తిరిగి ఆత్మకూరుకు వచ్చి వెళ్ళేదన్నారు. అలా కాకుండా ఎఎస్ పేట నుండి హసనాపురం,కలిగిరి మీదుగా వెళ్లేటట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బస్సు ప్రతిరోజూ ఆత్మకూరు నుంచి బయలుదేరి 6 గంటలకు ఎఎస్ పేట మీదుగా హసనాపురం, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, పామూరు, పొదిలి, వినుకొండ, మాచర్ల, సాగర్, హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. అదేరోజు సాయంత్రం తిరిగి అక్కడి నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఎఎస్ పేట మీదుగా ఆత్మకూరు చేరుకుం టుందన్నారు. ఈ అవకాశాన్ని యాత్రికులు, ప్రయాణికులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

డిపో మేనేజర్ షేక్.కరీమున్నీసా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో సత్తా చాటిన నెల్లూరు స్విమ్మర్స్

ప్రజాశక్తి-నెల్లూరు

విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరవ మాస్టర్స్ అంతర్ జిల్లా స్విమ్మర్స్ చాంపియన్షిప్ పోటీల్లో నెల్లూరీయులు తమ సత్తాచాటి 25 మెడల్స్ సాధించారు. విజ్జి మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్ లో జరిగిన ఈ పోటీలలో నెల్లూరు జిల్లా నుంచి పాల్గొన్న స్విమ్మర్స్ రికార్డు స్థాయిలో 13 గోల్డ్ మెడల్స్,10 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్ తో కలిపి మొత్తం 25 మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయిలో సింహపురి సత్తాను చాటారని జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షులు పి సనత్ కుమార్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న మోపూరు పెంచలయ్య 65-69 విభాగంలో రెండు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని, 60-64 విభాగంలో బివి. కష్ణారెడ్డి 4గోల్డ్, 70-74 విభాగంలో ఆర్ హరిసింగ్ 3 గోల్డ్, 1 సిల్వర్, 40-44 విభాగంలో ఎన్ పెంచలరెడ్డి 3 సిల్వర్, 50-54 విభాగంలో యస్ మధు 2 గోల్డ్, 1 సిల్వర్, ఎన్ శ్రీనివాసులు 1 సిల్వర్, 45-49 విభాగంలో కె విజయభాస్కర్ 1 సిల్వర్, 1 బ్రాంజ్, మెడల్ సాధించి రాష్ట్రస్థాయిలో నెల్లూరు సత్తాను నిరూపించారని కొనియాడారు. అత్యుత్తమ ప్రతిభను కనపరిచి నెల్లూరు జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేసిన విజేతలకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డి, పినాకిని స్విమ్మర్ అసోసియేషన్ అధ్యక్షులు మోపూరు పెంచలయ్య, ఎం నాగేశ్వరరావు, సింహపురి స్విమ్మర్ అసోసియేషన్ అధ్యక్షులు హైటెక్ రమణారెడ్డి, నర్సింహారెడ్డి అభినందనలు తెలియజేశారు.



గౌతమ్‌రెడ్డి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

కీర్తిశేషులు మేకపాటి గౌతమ్ రెడ్డి చిరస్మరణీయుడు పుస్తకం ఆవిష్కరణ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మేకపాటి గౌతమ్ రెడ్డి ప్రజాప్రతినిధిగా, రాష్ట్ర కేబినెట్ మంత్రి గా సమర్థవంతంగా ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజల్లో గొప్పగా కీర్తిప్రతిష్టలు పొందిన వ్యక్తి పుస్తకం రాయడం సంతోషదాయకమన్నారు. రచయిత రామకష్ణ రెడ్డి ని ప్రశంసించారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, నెల్లూరు జడ్పీ సభ్యులు కోఆప్టెడ్ షేక్ గాజుల తాజుద్దీన్, జెడ్పీటీసీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం

చౌక దుకాణంపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని 33వ రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సిఐ మాణిక్యాలరావు సిబ్బందితో కలిసి రేషన్ షాపులో రికార్డులను,స్టాక్ ను పరిశీలించారు.సుమారు 80 బస్తాల బియ్యం రికార్డుల కంటే తక్కువగా ఉండటాన్ని గుర్తించారు.చౌక దుకాణం యజమాని పై చట్టపరమైన కేసు నమోదు చేసి షాపును సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది మస్తాన్ బాషా, గిరిధర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధా, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బాదుడే..బాదుడు కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రంలో బాదుడే..బాదుడు

ప్రజాశక్తి-లింగసముద్రం

అధికారం చేతిలో ఉంది కదా అని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించేది లేదని, తాము అధికారంలోకి వస్తే అంతకు రెండింతలు చెల్లిస్తామని కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు.బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెంట్రాల పంచాయతీలోని కొత్తపేట, రాళ్ళపాడు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు.పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లింగసముద్రం మండలంలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరించి కేసులు పెట్టడం,పొలం తగాదాలు సృష్టించి దాడులకు పాల్పడటం జరుగుతుందన్నారు. వైసిపిలోకి రావాలంటూ తమ కార్యకర్తలను బెదిరిస్తున్నారని ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కానీయకుండా అడ్డుపడుతున్నారని మండిపడుతున్నారు. తమ నేతలు,కార్యకర్తలు ధైర్యంగా వైసిపి నేతల దుర్మార్గాలను ఎదుర్కొంటున్నార న్నారు.వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షల కోట్లు అప్పులు చేసి జనాలపై ఛార్జీలు,పన్నుల భారం మోపి చీచీ అనిపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి కందుకూరు నియోజవర్గంలో విజయం సాధించేలా ఆశీర్వదించాలని కోరారు.డాక్టర్ దివి శివరాం మాట్లాడుతూ ఒక్క ఛాన్స్‌అంటూ జగన్‌ను నమ్మి ఓటేస్తే నెత్తిన టోపి పెట్టాడని విమర్శించారు.వైసిపి పాలనపై ప్రజల్లో ఉన్న తీవ్ర అసంతృప్తి టిడిపి విజయానికి సంకేతం అని అన్నారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని నాగేశ్వరరావు దృష్టికి తెచ్చారు.మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామా పార్టీ అధ్యక్షులు బొల్లినేని రమణయ్య, స్థానిక నాయకులు గొల్లపల్లి వెంకటేశ్వర్లు, మద్దెల రామారావు, కిలారి కొండయ్య, బోడి సురేష్, టిడిపి నాయకులు నాయబ్ రసూల్, బొల్లినేని నాగేశ్వరావు, అడపా రంగయ్య, నీలం బ్రహ్మారెడ్డి, గాలంకి ప్రసాద్, ఎందోటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

2021-2022 సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని జిల్లా నూర్ బాషా దూదాకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సలీం తెలిపారు. సోమవారం స్థానిక హాబీ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు నియోజకవర్గ దూదాకుల నూర్ భాషా సంక్షేమ సంఘ ఇన్‌ఛార్జి డాక్టర్ షేక్ ఖాజామీయా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో 500 పై మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియట్లో 900 పైన మార్పులు సాధించిన విద్యార్థులకు డిసెంబర్ లో జరగబోయే దూదాకుల నూర్ భాషా సంక్షేమ సంఘ సమావేశంలో ప్రతిభ ప్రోత్సాహక పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. పైన తెలిపిన అర్హత గల విద్యార్థులు ఎవరైనా ఉంటే ఆత్మకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ ఖాజా మీయా వద్ద దరఖాస్తులు చేసుకోవడానికి 9985893949 ఈ నెంబర్ కు సాంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్

షెడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

అసంపూర్తిగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రం మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సోమవారం ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా శిథిలమైపోయిన ఈ షెడ్డును తక్షణం మరమ్మతులు చేసేలా తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులను సూచించారు. ఉపాధి హామీ నిధులతో వీలైనంత తొందరగా షెడ్డు మరమ్మతులు పూర్తికి గ్రామపంచాయతీ ద్వారా పనులను చేపట్టాలని కార్యదర్శి ఆర్.నరసయ్యకు సూచనలు చేశారు. త్వరలో వర్మీ కంపోస్ట్ తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జున, ఉపాధిహామీ సిబ్బంది, మండల కోఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ పాల్గొన్నారు.

కామాక్షితాయి దేవస్థానంలో పూజలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీస్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామ మార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు టి.నందకుమార్, ఎం.శివకుమార్, తిరుమూరు సుప్రజ, గుంటూరు కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రం స్థానిక వినాయక నగర్ లో నివాసం ఉంటున్న వైసిపి సీనియర్ నాయకులు నీలం వెంకట సాయి కుమార్ తండ్రి మస్తానయ్య(82) ఆదివారం మతి చెందిన విషయం విధితమే. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కావలి ఎఎంసి చైర్మన్ మన్నె మాల సుకుమార్ రెడ్డి సోమవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆయన మతికి గల కారణాలు తెలుసుకొని అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఆయన మతి పట్ల విచారణ చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఏఎస్‌పేట

మండలం చిరమన గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి దేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి శివాలయంలో ఆలయ నిర్వాహకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి జరుగుతున్న ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన పూజారి కందుర్తి సురేష్ స్వామి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

బిట్రగుంట

బోగోలు మండలం విశ్వనాధరావుపేట రామస్వామి పాలెంలో శ్రీవిఘ్నేశ్వర శ్రీ రామలింగేశ్వర దేవస్థానం శివాలయం కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా రుద్రాభిషేకం జరిగింది. ఉభయ దాతలు చిలక జయ రామయ్య ,ధర్మపత్తిని భారతి అభిషేకాలు పూజలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర ,భక్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో అసిస్టెంట్ కలెక్టర్ విద్యాదరి

భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

స్థానిక భవిత కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ విద్యాదరి సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల వికలాంగ పిల్లలకు ఏ విధంగా విద్యను బోధిస్తున్నారు? ప్రతి వారం ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నారా, లేదా? తదితర అంశాలపై అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణినీ అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి సంబంధించిన అన్ని రికార్డులనూ పరిశీలించారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల వికలాంగ పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలూ అందించాలని వారికి సూచించారు. ఈ సందర్భ ంగా పిల్లల తల్లిదండ్రులు ఆమెను మరుగుదొడ్ల సౌకర్యం లేదు అని అడిగారు. అంతేకాకుండా స్పీచ్ థెరపిస్ట్ ను ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ నీ, సిబ్బంది కోరారు.దీనిపై ఆమె స్పందిస్తూ సంభందిత అధికారులకు సమాచారం అదించి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వీరి వెంట ఐ కోఆర్డినేటర్ ధనమ్మ, మండల విద్యాశాఖ అధికారి దిలీప్ కుమార్, తదితర సిబ్బంది ఉన్నారు.